క్లుప్తంగా

ప్రజాపాలన సెల్ ఏర్పాటు



బయ్యారం : రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా స్వీకరించిన దరఖాస్తుల్లో మార్పులు కొత్తగా దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేక సెల్‌ను సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ అవసరమైన ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

కేజీబీవీల నిధులు విడుదల

మహబూబాబాద్ అర్బన్: కేజీబీవీ పాఠశాలలకు సంబంధించిన చికెన్, మటన్, కూరగాయల, పండ్లు, కిరాణాసామాగ్రి సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల పెడింగ్ బిల్లుల నిధులు సోమవారం విడుదలయ్యాయి. అదేవిధంగా 8 మోడల్ స్కూల్‌లకు సంబంధించిన సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలల పెండింగ్ బిల్లులు నిధులు కూడా విడుదలయ్యాయన్నా రు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, తాజా కూరగాయలను, కిరాణాసామగ్రిని అందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పనిచేసిన వారిని గుర్తించాలి

డోర్నకల్: కష్టకాలంలో పార్టీ కోసం పని చేసిన వారిని పార్టీ గుర్తించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డీఎస్ జగదీష్ అన్నారు. మండలంలోని ముల్కలపల్లిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పదేళ్లుగా పార్టీ అభివృద్ధి కోసం కృషి చేసిన తనకు మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇవ్వాలని జగదీష్ కోరారు.

ఎంపీగా అవకాశం కల్పించాలి

మరిపెడ: మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా రాయపురం సాంబయ్య ఏకలవ్యకు అవకాశం కల్పించాలని తెలంగాణ ఎరుకల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంగడ ఉపేంద్ర కోరారు. మరిపెడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో అనేక కులాలకు రాజకీయంగా, ఆర్థికంగా తగిన గుర్తింపు వచ్చింది. ఏకలవ్య సామాజిక వర్గానికి చెందిన కులానికి ఎలాంటి ప్రాధన్యత లేదన్నారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

బయ్యారం : అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళ వైద్యఖర్చుల నిమిత్తం ఇల్లందు మార్కెట్ కమిటీ కార్యదర్శి నరేష్ సోమవారం ఆర్థికసాయం చేశారు. బయ్యారంలోని దళిత కాలనీకి చెందిన పోతురాజు మనీషా నరాల సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. పేద కుటుంబానికి చెందిన మనీషాకు మెరుగైన వైద్యం నిమిత్తం డబ్బులు అవసరం ఏర్పడటంతో విషయం తెలుసుకున్న మార్కెట్ కమిటీ కార్యదర్శి మనీషా కుటుంబ సభ్యులకు రూ.5500 అందజేశారు.

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి

మరిపెడ రూరల్: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని లూనావత్ తండా గ్రామ పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ నిధుల నుంచి మంజూరైన రూ. 5 లక్షల సీసీ రోడ్డును ఆయన సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లూనావత్ వెంకన్న, బీలు, రెడ్డి, హట్టి, జెత్రామ్, భద్రు, లింగ్యా, రవి, పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు



గార్ల: తెలంగాణ గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన కుంట హారిక, పూనెం పూజిత, ఎస్‌కె అనాజ్, నవ్యలకు బహుమతలు ఆంగ్ల డిక్షనరీలను అందజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి గంగావత్ శ్రీనివాస్, టీటీఎఫ్ గౌరవ అధ్యక్షుడు ఎం శివ, డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్, జి భాస్కర్‌నాయక్, పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభ్యున్నతే ధ్యేయం

గార్ల: గ్రామీణ ప్రాతాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని గోపాలపురం ఎంపీటీసీ దనియాకుల రాజకుమారి అన్నారు. సోమవారం గోపాలపురంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.36.14 లక్షల నిధులతో మనఊరు- మన బడి కింద పాఠశాల ప్రహరీ, కిచెన్ షెడ్, మరుగుదొడ్ల నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. అదే విధంగా రూ.10 లక్షల నిధులతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏఈ శ్రీనివాస్, స్పెషల్ ఆఫీసర్ వేణుగోపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సరస్వతి, పాల్గొన్నారు.

పిల్లలను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే

● ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్

నెల్లికుదురు: ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను తీర్చిదిద్ది రేపటి పౌరులుగా ఎదిగేలా చేసే బాధ్యత ఉపాధ్యాయులదేనని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని పార్వతమ్మగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో దాతలచే ఏర్పాటు చేసిన డిజిటల్ తరగతులు, మహాత్మాగాంధీ విగ్రహాన్ని స్థానిక అధి కా రులు, ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలిసి సో మవారం ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ 1982లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ పాఠశాల పిల్లలు లేక మూతబడే పరిస్థితిలో హెచ్‌ఎంగా బాధ్యతలు చేపట్టిన నరేంద్ర కుమార్ చొరవతో ఇప్పుడు 104 మందితో పిల్లలతో కొనసాగించడంపై ఆయనను ఎమ్మెల్యే అభినందించారు. హెచ్‌ఎంను జిల్లాలోని పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి, ఎంపీడీఓ బాలరాజు, విద్యాకమిటీ చైర్మన్ ఎదళ్ల యాదవరెడ్డి, వైస్ ఎంపీపీ జెల్ల వెంకటేష్, ఎంపీటీసీ గుట్టయ్య పాల్గొన్నారు.



నెల్లికుదురు: పాఠశాలలో గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

కాంగ్రెస్ హయాంలోనే పేదలకు మేలు

కేసముద్రం : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పేదలకు మేలు జరుగుతుందని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ అన్నారు. సోమవారం మండలంలోని కోరుకొండపల్లిలో నిర్వహించిన గ్రామ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీలో కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్క కార్యకర్తను కాపాడుకుంటామన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఏవిధంగానైతే తనకు మెజారిటీ ఇచ్చి గెలిపించారో, పార్లమెంట్ ఎన్నికల్లో అధిష్టానం నిర్ణయించిన ఎంపీ అభ్యర్థిని గెలిపించుకోవాలన్నారు. ముందుగా గ్రామంలోని గ్రామదేవత శ్రీలక్ష్మి, భూలక్ష్మి, మహలక్ష్మి, ముత్యాలమ్మ తల్లి, పెద్దమ్మతల్లి ఆలయాల్లో పూజలు చేశారు. అనంతరం బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, పీసీసీ సభ్యుడు దస్రూనాయక్, బండారు వెంకన్న, భూలోక్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పోలియో చుక్కలు వేయించాలి

దంతాలపల్లి : 0 నుండి 5 సంవత్సరాల లోపు వయసు కలిగిన ప్రతి శిశువుకు పోలియో చుక్కలు తప్పనిసరి అని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధి డాక్టర్ నవీన్, తెలంగాణ రాష్ట పోలియో చుక్కల పరిశీలకుడు శ్రీకాంత్ అన్నారు. సోమవారం మండలకేంద్రంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మురళీధర్‌తో కలిసి వైద్యశాలపరిధిలో దంతాలపల్లి, నర్సింహులపేట ఉమ్మడి మండలాల్లో ఇంటింటా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంట్లో పిల్లలు ఉన్నారా, పోలియో చుక్కలు వేయించారా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్యసిబ్బంది, ఆశా వర్కర్లు నిర్లక్ష్యం వహించకుండా చుక్కలు వేయాలని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి చైతన్య, సీహెచ్‌ఓ బాలాజీ, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, పాల్గొన్నారు.

ఇంటింటికి పల్స్ పోలియో పరిశీలన

మహబూబాబాద్ రూరల్ : ఇంటింటికి పల్స్ పోలియో కార్యక్రమాన్ని డీఎంహెచ్‌ఓ డాక్టర్ అంబాల అంబరీష సోమవారం పరిశీలించారు. మండలంలోని కంబాలపల్లి, మల్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ఇంటింటికి పల్స్ పోలియో చుక్కలు వేశారా లేదా అని విచారణ చేశారు. ఆయన వెంట పల్స్ పోలియో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుధీర్ రెడ్డి, వైద్యాధికారి విరాజిత, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కృష్ణార్జునరావు, హెల్త్ ఎడ్యుకేటర్లు కేవీ. రాజు పురుషోత్తం, హెచ్‌ఈఓ రామకృష్ణ ఉన్నారు.



దంతాలపల్లి : దంతాలపల్లిలో సర్వే నిర్వహిస్తున్న శ్రీకాంత్, వైద్యులు

కురవి: మండల కేంద్రంతోపాటు సీరోలు మండలం కాంపల్లి, ఉప్పరిగూడెం గ్రామాల్లో బూత్‌స్థాయిలో రెండో రోజు పోలియో చుక్కలు వేసే కార్యక్రమంలో భాగంగా సోమవారం ఇంటింటిని సందర్శించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ అంబరీష కురవి పీహెచ్‌సీ పరిధిలోని ఇళ్లకు వెళ్లి పరిశీలించారు. వైద్యాధికారి విరాజిత, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కృష్ణార్జునరావు, హెల్త్ ఎడ్యుకేటర్స్ కేవీ రా జు పురుషోత్తం, హెచ్‌ఇఓ రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో గౌరవం



పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అశోక్

చిన్నగూడూరు: విద్యతోనే సమాజంలో గౌరవం, ముందడుగు సాధ్యమని సైకాలజిస్టుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. సోమవారం స్థానిక కస్తూర్బా బాలికల పాఠశాలలో ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థినులకు ప్రేరణ కార్యక్రమంలో భాగంగా 'పరీక్షల్లో విజయం సాధించాలంటే' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ అశోక్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యాలు, చదువుకునే పద్ధతులు, జ్ఞాపకశక్తి మెలకువలు, టెన్షన్ అధిగమించే మార్గాలు వంటి అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సహజ, ఎస్‌ఓ లలిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యలో రాణిస్తేనే భవిష్యత్

మహబూబాబాద్ రూరల్ : విద్యార్థులు విద్యలో రాణించి ఉజ్వల భవిష్యత్ ఏర్పర్చుకోవాలని పర్వతగిరి ఎంపీపీఎస్ హెచ్‌ఎం పంజాల లింగమూర్తి అన్నారు. మండలంలోని పర్వతగిరి మండల ప్రజాపరిషత్ పాఠశాలలో సోమవారం స్వయంపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి పట్టుదలతో చదువుకోవాలని సూచించారు. ఎంఈఓగా నిహారిక, హెచ్‌ఎంగా రిత్విక్, పలువురు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుమీలారాణి, గీత, మమత, భాగ్యమెర్సీ, రాధిక పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ



కేసముద్రం: కేసముద్రం, ఇనుగుర్తి మండల కేంద్రాల్లోని జెడ్పీహైస్కూల్‌లో నేషన్ ఫస్ట్ హ్యూమన్ చైన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం 85 చొప్పున లైబ్రరీ పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం పాఠశాలల ఆవరణలో మొక్కలు నాటారు. ముఖ్యఅతిథిగా హాజరైన అంతర్జాతీయ పర్వతారోహకుడు యశ్వంత్ మాట్లాడుతూ పాఠశాలల్లో ఇలాంటి సేవాకార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. ఇందుకుగాను ముందుకు వచ్చిన దాత వాంకుడోతు రమేష్‌ను అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు రాజు, రూపారాణి, పీఈటీ కొమ్ము రాజేందర్, ఫౌండేషన్ జాతీయ ఎగ్జిక్యూటివ్ మెంబర్ రమేష్, వినోద్, ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



బహుమతులు అందుకున్న విద్యార్థులతో నేతలు

మహబూబాబాద్ అర్బన్: పదో తరగతి వార్షిక పరీక్షలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని గిరిజన సామాజిక చైతన్య వేదిక జిల్లా అధ్యక్షుడు గుగులోత్ కిషన్‌నాయక్ అన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో టెన్త్ విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ గత నెల ఏర్పాటు చేయగా జిల్లా కేంద్రంలోని గాదె రుక్మారెడ్డి హైస్కూల్‌లో సోమవారం అభినంద సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్‌నాయక్ మాట్లాడుతూ మహనీయులను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు కష్టపడి చదవాలన్నారు. అనంతరం టాలెంట్ పరీక్షలో ప్రతిభ సాధించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హైస్కూల్ కరస్పాండెంట్ కృష్ణమూర్తి, డైరెక్టర్ రీనా, కాంగ్రెస్ జిల్లా నాయకులు శంతన్‌రామరాజు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సాయికుమార్, మధు, సూర్యప్రకాష్, జ్యోతిబాస్, సింహాంద్రి, రాకేష్, వినయ్, చరణ్ , తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

మహబూబాబాద్ రూరల్ : ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని, మనం చేసే ఆధ్యాత్మిక యాత్రలు మానవ జీవితానికి పరమార్థాన్ని తెలియజేస్తాయని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు శంతన్ రామరాజు అన్నారు. మానుకోట నుంచి అయోధ్య వెళ్లే భక్తులకు రైల్వేస్టేషన్లో శంతన్ రామరాజు సోమవారం శుభాకాంక్షలు తెలిపి మాట్లాడారు. జీవితంలో క్రమశిక్షణకు, ఉన్నత విలువలకు అనుగుణంగా ఆనాడు రామరాజ్య పాలన సాగిందన్నారు. మానవ జీవితంలో భక్తి భావన అనేది మానసిక ప్రశాంతతకు, ప్రేమ, ఆప్యాయతలకు నిదర్శనమన్నారు. ధర్మాన్ని, బాధ్యతలను వీడని ప్రతి మనిషి పరమ పవిత్రమైన పరమాత్ముని ఆత్మలో విలీనమవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పిట్టల బుచ్చిరామారావు, వెంకటనారాయణ, రఘు, వీరభద్రం, చంద్రశేఖర్, సైదులు, జగ్గయ్య, కుమార్, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.



భక్తులను సాగనంపుతున్న శంతన్ రామరాజు

హక్కులను సద్వినియోగం చేసుకోవాలి

కేసముద్రం : మహిళలు తమకున్న హక్కులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ నలమాల అరుణ అన్నారు. సోమవారం కేసముద్రం విలేజ్‌లోని ఎన్టీఆర్ నగర్‌లోని అంగన్‌వాడీ సెంటర్‌లో మహిళల హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలన్నారు.ఏసీడీపీఓ విజయలక్ష్మీ, సూపర్‌వైజర్ సువర్ణ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మరిపెడ రూరల్: మహిళా హక్కులను కాపాడాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీలత అన్నారు. మార్చి 8 అంతర్జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని నీలికుర్తి గ్రామ పరిధిలోని మూన్యతండ, వీరారం-1 ,2 అబ్బాయిపాలెం గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం వేడుకలను నిర్వహించారు. వీరారం అంగన్‌వాడీ కేంద్రం వేడుకల్లో సూపర్‌వైజర్ పాల్గొని మాట్లాడుతూ 100, 181, 108, 1098 మహిళ హెల్ప్‌లైన్ నంబర్లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



కేసముద్రం: మాట్లాడుతున్న అరుణ

పేదల ఇంట్లో వెలుగులు నింపడమే ధ్యేయం



జీరో బిల్లును అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

గార్ల: ప్రతీ పేదవాడి ఇంట్లో వెలుగులు నింపడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ బట్టు నాగరాజు, జెడ్పీటీసీ జాటోత్ ఝాన్సీలక్ష్మి అన్నారు. సోమవారం గార్లలో గృహజ్యోతి పథకాన్ని వారు ప్రారంభించి జీరో కరెంట్ బిల్లును లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం గృహజ్యోతి కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. ఎంపీటీసీ మాలోత్ వెంకట్‌లాల్, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణగౌడ్, ఏఈ మహేంద్రబాబు, సాంబమూర్తి, పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతున్న మహిళ మృతి

కేసముద్రం: పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ మహిళ చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన కేసముద్రం విలేజ్‌లో సోమవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గుండెల వినోద(50) నాలుగురోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడగా చికిత్స నిమిత్తం మానుకోట ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందింది. మృతురాలి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఎస్సై వంశీధర్‌ను వివరణ కోరగా తమకు పిర్యాదు రాలేదని తెలిపారు.

గాంధీనగర్‌లో వ్యక్తి..

మహబూబాబాద్ రూరల్ : చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందిన ఘటన మున్సిపాలిటీ పరిధిలోని గాంధీపురంలో సోమవారం చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై దీపికరెడ్డి వివరాల ప్రకారం... గాంధీపురం గ్రామానికి చెందిన రావిశెట్టి యాకయ్య ఆర్థిక ఇబ్బందులతో గత నెల 21న పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించగా అక్కడే చికిత్స పొందుతున్నాడు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి భార్య యశోద ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం వారికి అప్పగించారు.

చెట్టుపై నుంచి పడి వ్యక్తికి తీవ్రగాయాలు

కురవి: సీరోలు మండలం ఉప్పరిగూడెంలో కొబ్బరి చెట్టు ఎక్కి కాయలు కోస్తుండగా ప్రమాదవశాత్తు చెట్టుపైనుంచి జారి కింద పడడంతో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. ఉప్పరిగూడెం గ్రామానికి చెందిన వెంకన్న హైదరాబాద్‌లో ఉంటున్నాడు. ఆ వ్యక్తి ఇంట్లో కొబ్బరిచెట్టు ఉంది. చెట్టుకు కాయలు కోస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. 108లో ఆస్పత్రికి తరలించారు.

ఇద్దరి రిమాండ్


దంతాలపల్లి : మద్యం మత్తులో బిర్యానీ సెంటర్‌పై దాడి చేసి అడ్డుకోబోయిన పోలీసులపై దాడికి యత్నించిన ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై కరుణాకర్ సోమవారం తెలిపారు. మండల కేంద్రంలో ఖమ్మం-వరంగల్ జతీయ రహదారిపై ఆదివారం ఓ బిర్యానీ సెంటర్‌పై మండల కేంద్రానికి చెందిన సుతారపు అర్జున్, నెల్లూరి యువరాజ్ మద్యం మత్తులో వీరంగం సృష్టించారు. డయల్ 100 సమాచారం మేరకు అక్కడికి వెళ్లిన పోలీసులపై తిరగబడి, వారి విధులకు ఆటంకం కలిగించినందుకు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. మరోవ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిపారు.

పూరి గుడిసె దగ్ధం

గూడూరు: మండలంలోని భూపతిపేటలో విద్యుదాఘాతంతో ఓ పూరిగుడిసె దగ్ధమైన సంఘటన సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన పత్రి వెంకటయ్య దంపతులు కూలీ పనులు చేసుకుంటూ పూరిగుడిసెలో జీవనం గడుపుతున్నారు. ఉదయం ఇంటికి తాళం వేసి దంపతులు కూలీ పనులకు వెళ్లారు. ప్రమాదవశాత్తు ఇంట్లో విద్యుదాఘాతం సంభవించి అంటుకుంది. ఈ ఘటనలో కొంత నగదు, పట్టగొలుసులు, పావు తులం బంగారం దగ్ధమైంది. విషయం తెలుసుకున్న మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిట్టె వెంకన్న నాయకులు ఎడ్ల నరేష్‌రెడ్డి, బొల్లికొండ మధుగౌడ్ వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఎమ్మెల్యే సహకారంతో ఇందిరమ్మ ఇల్లు ఇప్పిస్తామని చెప్పి ఖర్చుల నిమిత్తం రూ. 2 వేలు అందించారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

బయ్యారం/గార్ల/దంతాలపల్లి: మిర్చి రైతులకు సరైన ధర ఇవ్వటం లేదని ఖమ్మంలో ఆందోళన నిర్వహిస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ సోమవారం బయారంలోని గంధంపల్లి-కొత్తపేటలో ఆ సంఘం నా యకులు రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకన్న, శ్రీను, కృష్ణ, వీరన్న, చంద్రు, రాంబాబు పాల్గొన్నారు. అలాగే గార్లలో న్యూడెమోక్రసీ నాయకులు ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎన్డీ మండల కార్యదర్శి జి సక్రు మాట్లాడుతూ అరెస్ట్ చేసిన నాయకులను బేషరతుగా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పీవైఎల్ జిల్లా కార్యదర్శి సీహెచ్ గణేష్, ఎస్ మనోహర్, బి మంగీలాల్, ఎం కొండల్‌రావు, హచ్చా, కాంతి, రవి, తదితరులు పాల్గొన్నారు. బొడ్లాడ క్రాస్‌రోడ్డు వద్ద సోమవారం అఖిల భారత రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అఖిలభారత రైతు కూలీ సంఘం తొర్రూరు డివిజన్ అధ్యక్షుడు ఊడుగుల లింగన్న, నాయకులు చెర్రి యా కన్న, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు తొట్టి వెంకన్న, డివిజన్ నాయకులు భిక్షపతి, రమేష్, అశోక్, లక్ష్మణ్, సందీప్, తదితరులు పాల్గొన్నారు.



బయ్యారం: దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

మహిళల హక్కులను కాలరాస్తున్న సర్కార్




మహబూబాబాద్ రూరల్ : కేంద్రంలోని బీజేపీ, మిత్రపక్షాలు మహిళల హక్కులను కాలరాస్తున్నాయని పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు గుజ్జు కృష్ణవేణి అన్నారు. అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవ సభ పోస్టర్లను మండలంలోని లక్ష్మీపురం (బి)లో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని సంఘం పిలుపునిచ్చిందని పేర్కొన్నారు.

వెయిట్‌లిఫ్టింగ్ పోటీలో విద్యార్థి ప్రతిభ



డోర్నకల్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో ఇటీవల నిర్వహించిన ఆరు జిల్లాల స్థాయి మాస్టర్స్ బెంచ్ ప్రెస్ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో డోర్నకల్‌కు చెందిన వీరదాస్ లక్ష్మణ్ ప్రతిభ కనబ ర్చాడు. భద్రాచలం అభ్యుదయ భవన్‌లో సిటీ స్టైల్ జిమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో డోర్నకల్ భారతవీర్ వ్యాయామశాలకు చెందిన లక్ష్మణ్ మాస్టర్-1 కేటగిరిలో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచాడు. లక్ష్మణ్‌ను మాజీ క్రీడాకారులు సుధాకర్, అమర్‌సింగ్, అశోక్ అభినందించారు.

వీరయ్య త్యాగం వెలకట్టలేనిది



గార్ల: భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా రాజీలేని పోరాటం చేసి, నిరుపేద రైతులకు భూములు పంచిన గౌని వీరయ్య త్యాగం వెలకట్టలేనిదని న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు గౌని భద్రయ్య అన్నారు. సోమవారం మండలంలోని మద్దివంచలో జరిగిన వీరయ్య 39వ వర్ధంతి సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. తొలుత ఆయన స్తూపం వద్ద పార్టీ సీనియర్ నాయకులు పార్టీ జెండాను ఆవిష్కరించారు.

ముగిసిన బాలకుమారస్వామి జాతర



గంగారం : మండలంలోని మడగూడెం శివారులోని కిష్టాపురం చుంచ వంశీయుల ఆరాధ్య దైవమైన బాలకుమరస్వామి జాతర సోమవారంతో ముగిసింది. గత మూడు రోజులు బాల కుమారస్వామికి ప్రత్యేక పూజలు చుంచ వంశీయులు ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. సోమవారం సాయంత్రం బాల కుమారస్వామిని గుట్టకు తీసుకెళ్లారు.

సంక్షిప్త సమాచారం


విద్యాభివృద్ధికి కృషి చేయాలి



నెల్లికుదురు: దేశంలో బాలికా విద్యకు బాటలు వేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో విద్యాభివృద్ధికి అందరు కలిసి కృషి చేయాలని నోడల్ అధికారి ఏ.రాందాస్ అన్నారు. టీపీటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మార్చి 10న నిర్వహించనున్న సావిత్రిబాయి పూలే విగ్రహావిష్కరణ, మహిళా సదస్సు వాల్ పోస్టర్లను సోమవారం మండలంలోని ఆలేరు జెడ్పీహెచ్ ఎస్‌లో ఆవిష్కరించారు.

గూడూరు : దేశంలో బాలిక విద్యకు బాటలు వేసిన సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో విద్యాభివృద్ధికి పాటుపడాలని టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు సోమ రవి అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో సోమవారం ఈ నెల 10న జిల్లా కేంద్రంలో జరిగే సావిత్రిబాయి పూలే విగ్రహావిష్కరణకు సంబంధించిన కరపత్రాలను టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు.

కాంగ్రెస్ నాయకుడికి ఎమ్మెల్యే పరామర్శ



డోర్నకల్ : ఇటీవల ద్విచక్రవాహనంపై నుంచి పడి గాయాలపాలై చికిత్స పొందుతున్న కాంగ్రెస్ పట్టణ ఉపాధ్యక్షుడు ఎల్లావుల హరికృష్ణను సోమవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ రాంచంద్రు నాయక్ పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట పట్టణ కాంగ్రెస్ నాయకులు మాదా శ్రీనివాస్, దాసరి నాని, ఖాదర్‌బాబా, శంకర్, నాగరాజు, హనుమ, యాకయ్య తదితరులు ఉన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

కురవి: విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా కష్టపడి చదివి వందశాతం ఫలితాలు సాధించాలని మాజీ ఎంఈఓ నల్ల లింగయ్య అన్నారు. సోమవారం మండలంలోని రాజోలు జెడ్పీ హైస్కూల్‌లో టెన్త్ విద్యార్థులకు సొంత ఖర్చులతో లింగయ్య పరీక్ష సామగ్రిని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరీక్షలు రాసే సమయంలో భయానికి లోనుకాకుడదని సూచించారు. 10/10 జీపీఏ సాధించిన విద్యార్థులకు రూ.1000 ఇస్తానన్నారు. లింగయ్యను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూపంపిణీలో అవకతవకలపై ఫిర్యాదు

కేసముద్రం: కేసముద్రం విలేజ్ పరిధిలోని దళితులకు కాకుండా పక్క గ్రామానికి చెందిన ఒకే కుటుంబంలోని ఇద్దరిని ఎల్‌పీఎస్ పథకం కింద 5.38 ఎకరాల భూమిని పంపిణీ చేశారని ఆరోపిస్తూ జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు చైతన్యనగర్‌కాలనీకి చెందిన పందుల స్పందన, సారయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేసముద్రం విలేజ్‌లో నిర్వహించిన గ్రామసభలో తప్పుడు ధృవీకరణలతో ఆ ఇద్దరిని ఎంపిక చేయడం జరిగిందని, దీనిపై విచారణ జరిపించాలని కోరినట్లు వారు పేర్కొన్నారు.

రాంరెడ్డికి నివాళి

బయ్యారం: మాజీ మంత్రి రాంరెడ్డి వెంకటరెడ్డి వర్ధంతి సందర్భంగా సోమవారం బయ్యారంలో ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ, ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధికి వెంకటరెడ్డి చేసిన సేవలను కొనియాడారు. ఆయన వెంట సొసైటీ చైర్మన్ మధుకర్‌రెడ్డి, ఎంపీటీసీలు శైలజ, మోహన్‌జీ, సొసైటీ డైరెక్టర్లు ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్, నాయకులు ఉన్నారు.

మాజీ సర్పంచ్ కట్టయ్య మృతి

మహబూబాబాద్ రూరల్ : మండలంలోని పర్వతగిరి మాజీ సర్పంచ్ చేబెల్లి కట్టయ్య సోమవారం మృతిచెందాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఇంటివద్ద మృతి చెందాడు. మృతుడికి భార్య పద్మ, ముగ్గురు కుమారులు ఉన్నారు.

వాటర్‌బాటిళ్ల పంపిణీ



గూడూరు: మండలంలోని భూపతిపేట ఎంపీయూపీఎస్ విద్యార్థులకు సోమవారం గ్రామానికి చెందిన గంగుల చంద్రమౌళి జ్ఞాపకార్థం అతని కుమారుడి దంపతులు రేణుక విశ్వేశ్వర్ వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలు నీడలో ఉంటూ దాహం వేయగానే నీళ్లు తాగాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గోపి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఎస్పీని గెలిపించండి

గార్ల: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఎస్పీ పార్టీని గెలిపించాలని ఆ పార్టీ మహబూబాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ బానోత్ రవీందర్ కోరారు. సోమవారం గార్లలో బీఎస్పీ పార్టీ ఎన్నికల వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు.